# పోటీ

## -మధు చక్రవర్తి



విఠల్ రావ్, వైకుంఠరావ్ తెలుగు పాఠక లోకాన్ని ఉర్రూతలూగిస్తున్న నేటి మేటి వర్ధమాన రచయితలు వాళ్ళ రచనల పట్ల అటు పాఠక ప్రపంచంలో 'క్రేజ్' ఉంది, యిటు పత్రికా సంపాదకుల్లో మోజూ ఉంది

విఠల్‌రావ్ రచనల్లు 'రాశి' తక్కువే అయినా 'వాశి' ఉన్న రకం. యిక వైకుంఠరావ్ అందుకు భిన్నం. అతగాడి రచనల 'రాశి' ఎక్కువే అయినా, వాటిలో 'వాశి' గలవి బహు తక్కువ.

మరో విషయం ఏంటంటే ఆ యిద్దరూ ఉండేది ఒకే వూరు. యిద్దరూ పని చేసేది ఒకే ఆఫీసు... పైపెచ్చు మాంచి స్నేహితులు కూడాను.

ఆఫీసు లంచ్ అవర్స్‌లోనూ, 'రీషర్' సమయాల్లోనూ సాహితీ విషయాలు మాట్లాడుకోడం తమ రచనల గురించి చర్చించుకోడం యిద్దరికీ పరిపాటి.

* * * * * *

ఎప్పటిలానే, 'తెలుగు వెలుగు' వారపత్రిక యాజమాన్యం ఈ సంవత్సరం కూడా, అత్యంత ప్రతిష్టాకరమైన 'క్రాంతి' అవార్డు కథల పోటీని ప్రకటించింది.

తెలుగు రచయితనని చెప్పుకునే ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక్కసారైనా, ఆ 'అవార్డును' పొందాలని ఆశిస్తారు. ఆ అవార్డు రావడం, తమకు ఘన సత్కారంగానూ, 'గౌరవ డాక్టరేట్' బిరుదుగానూ భావిస్తారు.

అంతటి ప్రాముఖ్యత ఉందా అవార్డుకి.

అయితే గత రెండు సంవత్సరాలుగా, ఆ అవార్డును విఠల్‌రావ్ కైవసం చేసుకుంటున్నాడు. ఈ సంవత్సరం కూడా దక్కించుకుంటే, 'హేట్రిక్' చేసిన ఘనత దక్కుతుంది.

వర్ధమాన రచయితలు చాలామంది, ఈసారి కూడా ఆ అవార్డు విఠల్‌రావ్‌కే దక్కుతుందని అంచనాలు వేస్తున్నారు.

అయితే తనకన్నా 'జూనియర్' రచయిత అయి ఉండీ, తను రాసిన రచనల్లో పాతికో వంతు రచనలు చేయని విఠల్‌రావ్ ఆ అవార్డును వరుసగా రెండుసార్లు గెలుచకోడం, వైకుంఠరావ్‌కి (ఎంత రచయితైనా) కంటగింపుగా ఉంది. అందులోనూ తనకు చదివి వినిపించాడు కూడా. కథను విఠల్‌రావ్ ఆ కథ చాలా ఉన్నత స్థాయిలో ఉంది. అందరూ అంచనా వేస్తున్నట్టు ఈసారి కూడా విఠల్‌రావ్ ఆ అవార్డు దక్కించుకుంటే, అతగాడికి 'హేట్రిక్' రావడం అటుంచి, తోటి రచయితల్లో, పాఠకుల్లో తన 'పర్సనల్ యిమేజ్' దెబ్బ తినడం ఖాయం.

ఈ ఆలోచన రావడమే తడవుగా. ఎప్పుడూ 'డైరక్టు ఫెయిర్ కాపీ' రాసి పంపించే, వైకుంఠరావ్, తన సహజ ధోరణి మానుకుని, ఈసారి రెండు, మూడు 'రఫ్ కాపీ'లతో మాంచి కథ యొకదాన్ని పకడ్బందీగా తయారు చేసాడు.

* * * * *

ఎప్పటిలానే చెప్పిన సమయానికి అవార్డు ఫలితాలు ప్రకటించారు 'తెలుగు వెలుగు' పత్రికాధిపతులు.

అయితే అందరూ ఆశించినట్టుగా... ఊహించినట్టుగా ఆ అవార్డు విఠల్‌రావ్‌కి దక్కలేదు.

ఆ అవార్డు గ్రహీత వైకుంఠరావ్'

ఫలితాలు ప్రకటించిన రోజునే పోటీకి పంపిన విఠల్‌రావ్ కథ తిరిగొచ్చింది.

అయితే తన కథ తిరిగొచ్చినందుకూ, వైకుంఠరావ్‌కి ఆ అవార్డు వచ్చినందుకు విఠల్‌రావ్ బాధపడ్లేదు. కాకపోతే అంత ఉన్నత స్థాయిలో ఉన్న కథ కనీసం సాధారణ ప్రచురణకు కూడా నోచుకోక పోవడం, అతన్ని ఆశ్చర్యపరిచింది.

అఫ్‌కోర్స్...

అవార్డు వచ్చిన వైకుంఠరావ్ కథ బహుమతి కథల స్థాయిలోనే ఉండొచ్చు. ఆ కథకు అవార్డు రావడం సమంజసమే కావచ్చు.

అయితే...

తను పోటీకి పంపిన కథను పరిశీలనకు తీసుకోవద్దనీ, తన మతిమరుపు కారణంగా, ఆ కథను యిదివరకే మరో పత్రిక్కి పంపడం జరిగిందనీ, ప్రచురణకు కూడా స్వీకరించబడిందని, కనుక అన్యథా భావించకుండా తన కథను తిప్పి పంపవలసిందిగా కోరుతున్నట్టు విఠల్‌రావ్ రాసినట్టుగా వైకుంఠరావే 'తెలుగు వెలుగు' పత్రికా సంపాదకునికి ఉత్తరం రాసాడనీ, ఆ పత్రికా సంపాదకునికగానీ, పాపం విఠల్‌రావ్‌కు గానీ యింతవరకూ తెలీదు!

*


